# నిమజ్జనం

చిన్నకథ

– జయసూర్య

అమ్మ లేని ఇల్లు. పాతపడిన ఆ పెంకుటి వసారా లోకి అడుగు పెట్టడంతోనే సరస్వతికి చిన్ననాటి జ్ఞాపకాలతో హృదయం కదిలింది. తాతల నాటి నుంచి చేనేత కుటుంబం కావటంతో ఆ ఇంట్లో మగ్గం కదలికల చప్పుడు సంగీతంగా వినపడేది. తనకు పదేళ్ళు వచ్చేటప్పటికే నాన్న సంపాదన అంతంత మాత్రం కావటంతో మగ్గం పని మూలపడింది. రోజు గడవటమే కష్టంగా వుండేది. అయినా అమ్మ, నాన్న ప్రేమతో తాము పస్తులుండి అన్నని, తనని పెంచి పెద్ద చేశారు. మగ్గం ఆడితే కాని డొక్కాడని రోజులలో అన్న, నాన్నకు సాయంగా వుండేవాడు. అమ్మ తనని మగ్గం దగ్గరకు రానిచ్చేది కాదు. రాత్రింబగళ్ళు నేతపనిలో తాను కష్టపడేది. నాన్న టిబితో మంచం పట్టడం వల్ల కుటుంబాన్ని తానే కాయకష్టంతో గరుపుకొచ్చేది. ఎంతో కష్టపడి స్కూలు ఫీజులు, పుస్తకాలను తెచ్చియిచ్చేది. నువ్వు బాగా చదువుకో అంటూ కన్నీళ్లు పెట్టేది. నాన్న క్రమేపీ కృంగి కృశించి చావు బతుకుల మధ్య వుండగా కూడా అమ్మ ఎపుడూ తనని పనిలో పెట్టలేదు. నాన్న పోయిన రోజులలో తాను కాలేజీలో చదువుకునేది. చిన్నప్పటి నుంచి లెక్కల్లో ఎప్పుడూ ఫస్ట్‌క్లాస్ మార్కులే. అదృష్టం బావుండి ఇంజనీరింగ్‌లో చేరింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో సెటిల్ అయింది. అయినా అమ్మ ఆ ఇంటిని వదిలిపెట్టలేదు. అన్న కుటుంబంతో అక్కడే వుండిపోయింది.



ఇళ్ళంతా హడావిడిగా వుంది. ఇంతలో అన్న, ముందు గదిలోకి వచ్చి అమ్మ ఫోటో అక్కడ బల్లపై వుంచి, పూలదండ వేశాడు. వదినె దీపం వెలిగించింది. ఫోటోలో వున్న అమ్మ సాదాసీదా పాత చీరెతో చిక్కిపోయి వుంది. అమ్మ మొహంలో నవ్వులేదు. కళ్ళల్లో ఏదో వేదన. ప్రేమగా ఎల్లావున్నావమ్మా!! అంటున్నట్టుంది. సరస్వతికి కన్నీళ్ళు ఆగటం లేదు. ''అమ్మా!'' అంటూ ఏడుస్తోంది. అమ్మకు తానేం చేయగలిగింది? ఆఖరి రోజులలో కూడా చూడలేకపోయింది. పిల్లల్ని దగ్గరకు తీసుకొని సరస్వతి ఏడుస్తుండటంతో విజయ్, ఆమె భుజంపై చేయి వేసి, పెద్దావిడ! వెళ్ళిపోయారు ఊరుకో, అంటూ ఊరడిస్తున్నాడు.

పదిరోజులు పోచంపల్లిలో ఉండటం విజయ్‌కు, పిల్లలకు చాలా ఇబ్బందైంది. 'సరస్వతీ! పిల్లలు ఇక్కడ వుండలేక పోతున్నారు. జ్వరం తగ్గటంలేదు. రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. అమ్మ తిరిగి రాదు కదా! అనుకొన్నట్టుగా ఫ్లైట్ కాచ్ చేద్దాం. తిరుగు ప్రయాణం వెంటనే, తప్పదు' అన్నాడు. అన్న, వదినె బంధువులు సరే అన్నారు. పుట్టి పెరిగిన ఊరు, చిన్ననాటి జ్ఞాపకాలు, కానీ అమ్మలేని ఇల్లు.

హైదరాబాద్ వెళ్ళి ఫ్లైట్ ఎక్కేరోజు రానే వచ్చింది. ''అమ్మా! నన్ను క్షమించు'' అంటూ బయలుదేరే ముందు తల్లి ఫోటోను కన్నీళ్ళతో వేడుకొంది సరస్వతి. అమ్మ పాత ట్రంక్‌పెట్టెలో ఎంతో జాగ్రత్తగా దాచిపెట్టిన పాకెట్ తన చేతికి ఇస్తూ అన్నయ్య అన్నాడు. ''అమ్మ పోయేముందు నీకోసం బెంగ పెట్టుకొంది. నిన్నే అడిగేది. నీకు ఇమ్మంది. 'ఏమిటన్నయ్యా! అయినా నా కెందుకు? వదినెకు ఇవ్వు అంది సరస్వతి' లేదమ్మా! అమ్మ ఆఖరి కోర్కె, నీకే ఇమ్మంది'' అన్నాడు.

అమెరికాలో కాలిఫోర్నియా, శాన్ ఫ్రాన్సిస్‌కోబే ఏరియాలో ఎలిజబెత్ పార్ట్‌లేక్ ప్రాంతం హడావిడిగా తెలుగు గృహిణుల అందచందాలతో సంరంభంగా వుంది. పుట్టి పెరిగిన ఊళ్ళను గుర్తుచేసుకుంటూ అక్కడ వుంటున్న తెలంగాణా జిల్లా మహిళలు, కుటుంబాలు భక్తిశ్రద్ధలతో బతకమ్మ పండుగ చేసుకొంటున్నారు. 'బతుకమ్మ బతకమ్మ ఉయ్యాలో', 'జయజయ జననీ' పాటలు వీనుల విందుగా పాడుతున్నారు. అమ్మ ఎంతో ప్రేమగా తన చేతులతో స్వయంగా నేసిన పోచంపల్లి ఆకుపచ్చజరీ పట్టుచీరెలో సరస్వతి, అమ్మను తలచుకొంటూ చెమ్మగిల్లిన కళ్ళతో లేక్‌లో నిమజ్జనం చేస్తోంది.

★